క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పూసపాటిరేగ: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ, విద్యుత్ స్తంభాల కేశారాలు తప్పుపట్టడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. వ్యవసాయశాఖ నుంచి రాయితీపై మంజూరైన ట్రాక్టర్లు.. డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించిన ప్రశ్నలు లేవనెత్తారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, ఎంపీడీఓ జి. రామారావు, ఏఓ నీలిమ, ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం సందర్శన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ దీపికాపాటిల్

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్లలో శనివారం సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నిక జరగ్గా.. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ ఎం. దీపికాపాటిల్ పరిశీలించారు. ఎన్నికలు జరుగుతున్న తీరు, పోలింగ్ సరళిపై భోగాపురం సీఐ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వితరణ



కంప్యూటర్ ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్న యువతి

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలకు దాతలు శనివారం వివిధ పరికరాలను వితరణగా అందజేశారు. విశాఖకు చెందిన పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాఠశాలకు 10 కంప్యూటర్లు, 4 ప్రొజెక్టర్లు, 2 తాగునీటి యంత్రాలను బహూకరించారు. అనంతరం వాటిని ప్రారంభించి ఎలా వినియోగించాలో అవగాహన కల్పించారు. కంప్యూటర్ విద్యపై ప్రాథమిక అంశాలను విద్యార్థులకు వివరించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి పనులకు శంకుస్థాపన



కుళాయి పనులకు భూమిపూజ చేస్తున్న గ్రామ పెద్దలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింట కుళాయి ఏర్పాటు పనులకు సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మంచినీటి అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు



లే అవుట్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఉన్నత పాఠశాల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్‌లో పంచాయతీ సిబ్బంది శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ, పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన లే అవుట్‌కు పంచాయతీ, ఉడా అనుమతులు లేవన్నారు. ఈ నేపథ్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

జామి: మండలంలో భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వరప్రసాద్ ఆచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అన్నంరాజుపేటలో పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి తులసీదళాలతో అలంకరించి పూజలు చేశారు.

జగనన్నను ఆశీర్వదించండి..



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, చిత్రంలో ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు



విజయనగరం: 50వ డివిజన్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



విజయనగరం: 42వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందించిన పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జులు

• ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: కుల మతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. నగర పంచాయతీ పరిధిలోని 15 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రత్యేక కార్యచరణతో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామన్నారు. తమకి ఓటు వేయని వారికి కూడా మంచి జరగాలనే గొప్ప మనసున్న నాయకుడు సీఎం జగనన్న అని చెప్పారు. నగర పంచాయతీ ప్రజలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయల లబ్ధి చేకూరిందన్నారు.

మంచిని మరిచిపోవద్దు : ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ, చేస్తున్న మంచిని మరిచిపోకూడదన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాని మధ్య తేడాను గమనించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల హవా నడిచేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. అనంతరం రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన మినీ వాటర్‌ట్యాంక్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, కార్పొరేషన్ డైరెక్టర్లు జానా ప్రసాద్, మద్దిల వాసు, నౌపాడ శ్రీను, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, వైకుంఠం, నాయకులు గంటా సత్యనారాయణ, అప్పలరాజు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విజయనగరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, డాక్టర్ వీఎస్ ప్రసాద్, కోలగట్ల తమ్మన్నశెట్టి అన్నారు. నగరంలోని 42,50 డివిజన్‌లలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం కోలగట్ల తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో మరింత మందికి మంచి జరగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, పట్టా ఆదిలక్ష్మి, సూర్యనారాయణ, కనకల నాగవల్లి, కంటుభుక్త తవిటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర వాతావరణంలో చదువులు



వంటగదిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవరావు

• డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువులు చెప్పాలని డిప్యూటీ డీఈఓ కంది వాసుదేవరావు సూచించారు. మండల కేంద్రంలోని మత్స్యకారుల బాలుర గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు, వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి ఎంతో కృషి చేస్తోందని.. ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సూర్యనారాయణమూర్తి, విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

23 నుంచి తెలుగు భాషా పండుగ వారోత్సవాలు

విజయనగరం టౌన్: వాగ్దేవి సమారాధనమ్, జై పైడిమాంబ వేద సంస్కృత పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో గిడుగు వేంకట రామమూర్తి జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా పండుగ వారోత్సవాలను ఈ నెల 23 నుంచి 29 వరకూ నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.స్వప్న హైందవి తులిసానేజ శనివారం స్థానిక గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలుగు భాషా పరిరక్షణకు గాను విద్యార్థులకు పద్యపఠనం, వ్యాసరచన, కథలు, కవితలు, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న గురజాడ గ్రంథాలయంలో గిడుగు జయంతి సభలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 87906 07303 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారు బి.సూర్యలక్ష్మి, సంస్థ ప్రతినిధులు గురజాడ ఇందిర, సంధ్యారాణి, సుభద్రాదేవీ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వప్నహైందవి, తదితరులు

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు



లక్కవరపుకోట: వరుస పద్ధతిలో వరిసాగుపై అవగాహన కల్పిస్తున్న సబల సంస్థ ప్రతినిధి ఈశ్వరరావు

కొత్తవలస: వరిసాగులో మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో సాగు చేస్తున్న వరి పంటను శనివారం ఆయన పరిశీలించారు. పంట తెగుళ్లను వ్యాప్తి చేసే పురుగులను ఆకర్షించేందుకు పసుపు అట్టలు వినయోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: వరిసాగులో వరుస సాగుపద్ధతిని అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సబల సంస్థ ప్రతినిధి కె.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని మార్లాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసయ విధానంలో సాగుచేస్తున్న వరుస పద్ధతిని రైతులకు చూపించారు. ఈ పద్ధతివలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై శనివారం అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్పీఎల్ ఎన్నిక నిర్వహించారు. ముందుగా నోటిఫికేషన్ విడుదల చేయగా.. 10 మంది విద్యార్థులు నామినేషన్ వేశారు. వారికి ఉపాధ్యాయులు గుర్తులు కేటాయించారు. అనంతరం అభ్యర్థులు తరగతి గదుల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సిబ్బందిగా పలువురు విద్యార్థులను నియమించారు. బాలికలు, బాలురకు వేరువేరుగా బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేసి పోలింగ్‌ను ప్రారంభించారు. 510 మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఓట్లు లెక్కింపు చేపట్టగా.. 127 ఓట్లు సాధించిన ఎస్.ప్రసన్న ఎస్పీఎల్‌గా ఎన్నికైనట్లు కౌంటింగ్ సిబ్బంది ప్రకటించారు. రెండో ఎస్పీఎల్‌గా సీహెచ్ నిహారిక 99 ఓట్లు సాధించినట్లు తెలిపారు. సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు కె.సన్యాసమ్మ, పి.నర్సింహులు, సిహెచ్.సన్యాసమ్మ ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించారు.



ఓటుహక్కును వినియోగించుకుంటున్న విద్యార్థిని

బిందు, తుంపర సేద్యంతో ప్రయోజనం

శృంగవరపుకోట: బిందు, తుంపర సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగుచేయవచ్చని ఏపీఎంఐపీ పీడీ పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ముషిడిపల్లి గ్రామంలో రైతు గార్లపాటి సత్యసాయికి రాయితీపై అందించిన తుంపర సేద్యం యూనిట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్ట ప్రాంతంలో పంటల సాగుకు బిందు, తుంపర సేద్యం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. ఈ విధానంలో ఎరువుల వినియోగం సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు. మండలంలో 24 మంది రైతులకు రూ.4,86,495 విలువైన 56 సూక్ష్మ సేద్యం యూనిట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట వీహెచ్‌ఏ ఎం.లావణ్యప్రభ, ఎంఐ ఏఓ మూర్తి, తదితరులు ఉన్నారు.



తుంపర సేద్యం యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ, తదితరులు

పెండింగ్ ఈకేవైసీలపై దృష్టి

గజపతినగరం: ఈకేవైసీ పెండింగ్ లేకుండా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈకేవైసీ అప్‌డేషన్ వివరాలను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సోమవారం నిర్వహించే స్పందనలో అందిన వినతులను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. అర్జీదారులు ఈకేవైసీ చేయించుకుంటే అన్నిరకాల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈకేవైసీ నమోదుపై దృష్టి సారించాలన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

జామి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వరరావు కోరారు. జాగరం గ్రామంలో మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో కోనేరు అభివృద్ధిపై శనివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. చెట్లు, చెరువుల ప్రాముఖ్యలను ప్రజలకు వివరించారు. రిపబ్లిక్ డే వేడుకల వరకు అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సేవాసంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఎంపిక పోటీలకు అర్హత

వేపాడ: బానాది గ్రామానికి చెందిన కుప్ప తులసి క్రీడల్లో రాణిస్తోంది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న తులసి ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 హాకీ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి ఎంపిక పోటీలకు అర్హత సాధించింది. ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలాలో జరిగే జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు శనివారం పయనమైంది. ఎంపీటీసీ జి.తులసి, జి.దేములు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కొత్తవలస: మండల కేంద్రంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. అధికారులు లేఅవుట్‌లో పర్యటించి ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ లేఅవుట్‌లో వీరభద్రపురం, కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం-1,2,4 పరిధిలో 189 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణరావు తెలిపారు. ఇప్పటివరకు కేవలం 33 ఇళ్లు మాత్రమే వందశాతం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నాయన్నారు. మిగిలినవి వివిధ స్టేజ్‌లలో నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు స్వస్తి పలకాలి



జామి: కుమరాం కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న ఎస్బీసీసీ రామకృష్ణ

జామి: రాష్ట్రంలో బాల్యవివాహాలకు స్వస్తి పలకాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశించారని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ(ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. మండలంలోని కుమరాం కేజీబీవీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్‌ఫుడ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, కేరీర్ గైడెన్స్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబరుకు సమాచారం అందించాలన్నారు. 'బాల్యం చదువు కోసం-పెళ్లి కోసం కాదు' అనే గోడపత్రికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బి.వి.సులోచన, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

దత్తిరాజేరు: వి.కృష్ణాపురంలో శనివారం రాత్రి నిర్వహించ తలపెట్టిన బాల్య వివాహాన్ని అడ్డుకున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి తెలిపారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. 18 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసినట్లయితే బాల్య వివాహ నిర్మూలన చట్టం-2006 ప్రకారం శిక్షార్హులుగా పేర్కొన్నారు.

ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల హవా...



విజయనగరం రూరల్: శ్రీదేవికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

• పడాలపేట సర్పంచ్‌గా శ్రీదేవి గెలుపు

విజయనగరం రూరల్: సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. విజయనగరం మండలం పడాలపేట సర్పంచ్‌గా సువ్వాడ శ్రీదేవి విజయం సాధించింది. గత సర్పంచ్ సువ్వాడ అప్పయ్యమ్మ మరణించడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికకు ఈ నెల ఆరో తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో సర్పంచ్ స్థానానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వాడ శ్రీను భార్య సువ్వాడ శ్రీదేవి వైఎస్సార్‌సీపీ మద్దతుతో నామినేషన్ వేయగా.. టీడీపీ మద్దతుతో సుంకరి ఆదిలక్ష్మి బరిలో దిగింది. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన ఎన్నికలో 1262 ఓటర్లకు గాను 1033 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో శ్రీదేవికి 736 , ఆదిలక్ష్మి 284 ఓట్లు, నోటాకు ఎనిమిది ఓట్లు పోలవ్వగా ఐదు చెల్లలేదు. దీంతో శ్రీదేవి 452 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజీవ్‌కుమార్ ప్రకటించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియను విజయనగరం ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే విజయనగరం మండలం కొండకరకాం పంచాయతీ తొమ్మిదో వార్డు సభ్యుడి ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన తుమ్మగంటి మంగ 17 ఓట్ల తేడాతో భోగాపురపు సత్యవతిపై విజయం సాధించింది.

డెంకాడలో...

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస పంచాయతీ 7వ వార్డు సభ్యుడి ఎన్నిక నిర్వహించగా 123 ఓట్లు పోలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు తోరుతు అప్పలసత్యవతికి 105 ఓట్లు రాగా.. టీడీపీ మద్దతుదారు అట్టాడ రమణమ్మకు 17 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లలేదని ఎంపీడీఓ స్వరూపారాణి, ఎన్నికల అధికారులు తెలిపారు. అనంతరం అప్పలసత్యవతికి ఎన్నికల అధికారి శర్మ ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తోరోతు త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: ఓటుహక్కును వినియోగించుకుంటున్న మహిళ



డెంకాడ: గెలుపొందిన వార్డు మెంబర్ తోరోతు అప్పల సత్యవతికి ధ్రుపత్రం అందజేస్తున్న అధికారులు



విజయనగరం రూరల్: బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐ తిరుపతిరావు

సత్తిబాబు విజయం..

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు శంకాబత్తుల సత్తిబాబు విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన ఓట్లు లెక్కింపులో సత్తిబాబు 88 ఓట్లు మెజార్టీతో విజయఢంఖా మోగించారు.మొత్తం 1626 ఓట్లుకుగాను 1476 ఓట్లు పోలయ్యాయి. ఇందులో శంకాబత్తుల సత్తిబాబుకు 756 ఓట్లు, పైడి పార్వతమ్మకు 668 ఓట్లు , 17 ఓట్లు చెల్లకపోగా, 35 ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు అనంతరం సత్తిబాబుకు రిటర్నింగ్ అధికారి బి. పాపునాయుడు ధ్రువపత్రం అందజేశారు.

దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోండి

• డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని కొనుగొన్న శాస్త్రవేత్త రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ, మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వల్ల వస్తుందని, ఎనాఫిలిస్ అనే దోమ కుట్టడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని చెప్పారు. వణుకుతో కూడిన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, చెమటలు పట్టడం, వాంతులు, వికారం, తీవ్రమైన తలనొప్పి, ఒంటి నొప్పులు వంటివి మలేరియా లక్షణాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకునేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ అచ్యుతకుమారి, జిల్లా మలేరియా నివారణ అధికారి మణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

• డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

గంట్యాడ: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో ఉన్న వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలు, ఓపీ రికార్డులు, ఫార్మసీని పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిందని, సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలందించాలన్నారు. వైద్యం అందక మరణించారనే మాట రాకూడన్నారు. కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలిగించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి కారణం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్, తదితరులు

జామి: మండలంలోని లొట్లపల్లిలో వార్డు మెంబర్ స్థానానికి శనివారం జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పల్ల గంగమ్మ విజయం సాధించింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, పార్టీ నాయకులు ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మద్దతుతో స్థానిక సర్పంచ్ జన్నేల సింహాచలం నాయకత్వంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులే వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి విజయానికి కారమన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ శీర చందునాయుడు, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, వైఎస్సార్‌సీపీ నేతలు పన్నింటి రవికుమార్, జన్నేల సూరిదేముడు, ఎస్.వాసు, సిడగ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

